# దత్తపది

అవధాన్లు గారంటే ఆ వూళ్ళో మంచి పేరు. ఆయన కవి. పండితులు. ఏ విషయం మీదైనా అనర్గళంగా మాట్లాడగలరు. ఆశువుగా పద్యాలు అల్లగలరు. పెద్ద బాల శిక్ష దగ్గర్నుంచి భగవద్గీత వరకు ఆయనకు కంఠోపాఠంగా వచ్చు. వార పత్రికల నుంచి పురాణాల వరకు అన్నీ చదువుతారు. తన అభిప్రాయాలు పక్షపాతరహితంగా చెబుతారు. అలాని కర్ణకఠోరంగా తూర్పారపట్టరు. ఎంతో క్రమబద్ధంగా వివరించి చెబుతారు. గర్విష్టి కాదు. ఎదుటివాడి పొడ గిట్టని రకం కాదు.

"రాయనియ్యండి. కాదనటం దేనికి? కాలానికి తట్టుకున్నవి నిలుస్తాయి. కాదని మనమంటే మాత్రం రాసేవాళ్ళు ఆగుతారా? తనకు కావల్సినవి భద్రంగా దాచుకునేపాటి శక్తి కాలానికి లేదంటారా?" అంటారే తప్ప ఎవ్వరినీ నొప్పించరు. ఎవరి మీదా కత్తి గట్టరు. మంచిని ప్రోత్సహిస్తే చెడు దానంతట అదే నశించి పోతుంది. ఇదీ ఆయన వాదన. ఇదీ ఆయన సిద్ధాంతం, వేదాంతం కాదు. వేసిన ప్రతి విత్తనం మొలకెత్తదు. అంత మాత్రాన విత్తకుండా వుంటామా? అనే ధోరణి. ఊళ్ళో ఏ సభ జరిగినా ఆయన్ని పిలుస్తారు. ఇష్టమున్నా లేకపోయినా ఎదుటి వారిని నొప్పించకూడదనే తత్వం కొద్దీ తప్పకుండా హాజరవుతారు. తనకు తోచిన నాలుగు ముక్కలు శ్రావ్యంగా చెబుతారు. ఆయన అధ్యక్ష పీఠం అలంకరిస్తే ఆ సభకు వచ్చే కళ వేరు. వేదిక మీద వాదోపవాదాలకు స్థానం వుండదు. అంతా సవ్యంగా జరిగిపోవాల్సిందే. ఎక్కడెక్కడి నుంచో సాహితీ అభిమానులు ఆయన ఇంటికి వస్తూం టారు. సభలకు ఆహ్వానిస్తారు. ఋణమో పణమో ముట్టజెపుతారు. రేపటికి వెతుక్కోకుండా రోజు గడిచి పోతోంది. అవధాన్లుగారు అష్టావధానాలు, శతావధానాలు కూడా చేస్తారు. సరస్వతీ దేవి ఆయన వాక్కులో తాండ విస్తుంది. అందుకే ఆయన అసలు పేరు ఎప్పుడో మరిచి పోయారు. అందరూ అవధాన్లుగారు అనటమే పరిపాటి.

ఒకరోజు మూడు ఝాములప్పుడు ముందు వసారాలో వాలు కుర్చీలో నడుమువాల్చి తీరికగా ఏదో పుస్తకం చదువుకుంటున్నారు. మధ్య మధ్యలో తలెత్తి వీధి వైపు యథాలాపంగా చూస్తున్నారు. గుమ్మం ముందు ఎవరో అయిదారు మంది వ్యక్తులు నిలబడి వుండడం చూసి లోపలకు రమ్మని సైగ చేశారు. ఆయన అలా సైగ చేయకపోయినా వారు ఉత్తర క్షణంలో లోపలికి దూసుకొచ్చేటందుకు సిద్ధంగానే వున్నారు. వచ్చిన వాళ్ళను బల్ల మీద కూర్చోమని ఆదరంగా అన్నారు. కానీ వాళ్ళు కూర్చునే స్థితిలో లేరు. వాళ్ళు ఎవరో అవధాన్లుగారు పోల్చుకోలేక పోతున్నారు. ఒక్క విషయం మాత్రం నికరంగా ఊహించగలిగారు. ఆగంతకులు విద్యా గంధానికి ఆమడదూరంగా వున్నారు. ఏదో ప్రాపంచిక విషయంగానే వచ్చి వుంటారు. జమాజెట్టీల్లాంటి వాళ్ళు. నదురు బెదురు నిఘంటువులో లేదు. ఆజ్ఞాపించటం తప్పితే అర్థించే సుగుణం ఎంత మాత్రం లేదని అవధాన్లుగారు ఇట్టే పసిగట్టారు. అయినా తన బోతూ రుచులెందుకులే అన్నట్టు ప్రశ్నార్థకంగా వారి వంక చూశారు.

"బండోడా! సెప్పరా. అట్టా సూత్తావేంటి?" అని ఓ గంట స్తంభం లాంటివాడు సీసాలా వున్న వ్యక్తితో దబాయిస్తున్నట్టు అన్నాడు. అది నిజంగా దబాయింపు కాదు. వారి మాట తీరే అంత అని అవధాన్లుగారు అర్థం చేసుకున్నారు.

సీసా ఏమీ మాట్లాడలేదు. ఓ పుస్తకం ముందుంచింది. అదేదో చిన్న నోటు బుక్, గ్రంథావిష్కరణ కోసం కాదని అట్ట చూడగానే అవధాన్లుగారికి అర్థమయింది. దానిని చూస్తూ వుండిపోయారు. ఏదో అసభ్యకరమైన నటి చిత్రం. దాని వంక చూడలేక తిప్పేసుకున్నారు. మొహం తిప్పుకోవటం తమని అవమానపరచటమే అన్నట్టు గంట స్తంభం కన్నెర్ర జేసి అవధాన్లుగారి వంక చూసింది. వీళ్ళంతా ఎవరు? ఏమిటి నోట్ బుక్? ఎందుకిలా ఉరిమినట్టు మాట్లాడుతున్నారు? ఈ సరస్వతీ నిలయంలో ముష్కరులు ప్రవేశించడమా? తులసి వనంలో గంజాయి చెట్లు మొలిచినట్టు వారి రాక అవధాన్లుగారిని కలవరపెట్టింది.

"బాబూ! మీరెవరో నాకు తెలియదు. ఈ పుస్తకం ఎందుకు నా ముందు ఉంచారో అంతకన్నా తెలియదు. మీకు ఏం కావాలో కాస్త వివరంగా చెబితే బాగుంటుంది" నీరసంగా అభ్యర్థనగా అన్నారు.

"మర్డరు ... కోర్టుకెల్లాలి... సందాలు సందాలు ... టుకెత్తుకోండి..." గంట స్తంభం గణ గణ అంది. అవధాన్లుగారికి అయోమయమయింది. ఇదే మామూలు పరిస్థితిలో అయితే ఈ పదాలను 'దత్తపది'గా భావించి ఏ రామాయణార్థంలోనో, భారతార్థంలోనో అనువుగా పద్యాలు చెప్పే వారే! కానీ అడిగిన వాళ్ళు పండితులు కాదు. అదేమీ సభావేదిక కాదు. ఎదురుగా వున్న వాళ్ళు రసజ్ఞులు అంతకన్నా కాదు.

"నేనేదో మామూలు ధోరణిలో పద్యాలు రాసుకునే వాణ్ణి. క్రైం నవలల జోలికి పోను. ఈ మర్డర్లు, కోర్టులు నాకేమీ తెలియవు. మీరు మరెవరినైనా వాకబు చేయండి" అంటూ ఆయన దీనంగా మొహం పెట్టారు.

ఇప్పుడు గంట స్తంభం తికమక పడింది. తను చెప్పేది అవధాన్లుగారికి అర్థం కాలేదని మరుక్షణం తెలుసుకుంది. అవధాన్లుగారు ఓ అజ్ఞాని అనీ, అసామాజిక ప్రాణి అనీ గంట స్తంభం నిర్ణయించుకుంది.

"ఒరే బండోడా! చాత్తుర్లుగారికి నువ్వే సెప్పరా. ఆరికి బొత్తిగా లోకగ్గానం లేదు" గంట స్తంభం గంట కొట్టినట్టు చెప్పింది.

"ఇదో శాస్త్రుల్లుగారూ! ఇది సందాల బుక్కు. ఇందులో ఈ పేటలోని వాళ్ళ పేర్లన్నీ వుండాయి. ఆటికెదురుగా ఆళ్ళిచ్చిన సందాలు ఎంతో రాసి వుండాయి. మీరూ పేరు రాయండి. లోనికెళ్ళి డబ్బులు పట్టుకు రాండి. మేం త్వరగా పోవాలి. ఇంకా సానా ఇళ్ళు తిరగాలి. బండోడు బాగానే చెప్పినట్టు పోజు ఇచ్చాడు. అయినా అవధాన్లుగారికి ఈ చందాలు ఎందుకు వసూలు చేస్తున్నారో బోధపడలేదు. పోనీ వివరంగా అడుగుదామన్నా మాట్లాడితే కరిచేట్టు చూస్తున్నారు వస్తాదులు.

అవధాన్లుగారు వాలుకుర్చీలోంచి లేచి నిలబడ్డారు. చందా తేవటానికి లోపలకు వెళుతున్నట్టు వస్తాదులు ఊహించారు. కానీ నిలబడ్డ అవధాన్లుగారు అడుగు ముందుకు వేయలేదు. ఇంకా ప్రశ్నార్థకంగానే వాళ్ళ వంక చూస్తున్నారు.

"ఇదేంటి చాస్త్రులు గారూ! మీరు శానా శానా సొస్తకాలు సూసి వుంటారు. ఇది తెలవదా? ఇది సందాల సొస్తకం. తెరవండి. మీకే తెలుస్తది. ఈడు ఓ మర్డరు కేసులో ఇరుక్కున్నాడు. కోర్టు సుట్టూ తిరగాలి. మరి డబ్బులు ఏడ నుంచి వత్తాయి. అందుకే పోగుచేస్తున్నాం. మీరూ ఓ వందో ఎభైయ్యో రాయండి. తప్పద్దా మరి మర్డరు కేసుగా"

మాటిమాటికి మర్డరంటూంటే అవధాన్లు గారు లోలోపల ఉలిక్కిపడుతున్నారు. పొద్దునే లేచి 'రామా' అన్నంత తేలిగ్గా వాళ్ళ 'మర్డరు' అంటూంటే ఆయనకు భయం భయంగా వుంది. అయినా వాళ్ళ మర్డరు కేసులో యిరుక్కోవట మేమిటి? ఊరంతా చందాలు పోగు చేయటమేమిటి? ఊళ్ళోవారు మర్డరు కేసుల్లో యిరుక్కుంటే తను విడుదల చేయడానికి సాయపడేందుకు కంకణం కట్టుకున్నాడా? అయినా ఎవరో ఎవర్నో చంపడమేమిటి? దసరా ఉత్సవాలకు, శ్రీరామనవమి పందిళ్లకు చందాలు ఇవ్వడమంటే ఆ దారి వేరు. అది

కాంచర్లకోట వెంకట సుబ్బారావు



దైవ కార్యం. ఇష్టమున్నా, లేకపోయినా నలుగురితో పాటు 'నారాయణా' అంటూ పది రూపాయిలు పారే యచ్చు. కానీ మర్డర్ల చందాలేమిటి? అవధాన్లు గారి మనస్సు పరిపరి విధాల పోయింది.

"చూడండి బాబూ! మీరు చూస్తే పెద్దమనుషుల్లా వున్నారు. ఎంతో మర్యాదగా మాట్లాడుతున్నారు. చందాలు యివ్వమంటున్నారు. బాగుంది. చందాలు ఎందుకు వసూలు చేస్తున్నారో కొంచెం అర్థమయినా, ఏదో గజిబిజిగా వుంది. ఎవరు మర్డరు చేశారు? ఎందుకు చేశారు? హంతకులకు చందాలు ఇవ్వడ మేమిటి? కాస్త వివరంగా చెబితే మీ పుణ్యం ఊరికే పోదు..." అవధాన్లు గారి జీవితంలో అదే మొదటిసారి అంత లౌక్యంగా మాట్లాడడం!

గంట స్తంభం మొహం జేవురించింది. కళ్లు చింత నిప్పుల్లా అయ్యాయి. పక్షవాతం వచ్చినవాడిలా క్షణం ఊగిపోయాడు. అతని ఆవేశం చూసి బండోడు కల్పిం చుకున్నాడు- "గురూ! నువ్వు ఊరికే యిదవ్వమాక. శాస్త్రుర్లు గారికి మన యవ్వారాలు బొత్తిగా తెలవ్వు. అందుకే అలా అడుగుతున్నారు. నేను ఈయనకు నచ్చచెబుతాగా!"

"ఇదిగో శాస్త్రుర్లుగారూ! ఇంతవరకు మమ్మల్ని యిలా నిలదీసి అడిగినాడు లేదు. మీరేదో పండితులు గందా అని గౌరవం. మాకు ఈ జల్మలో చదువు ఎలామా రాలేదు. మర్డర్లు చేయడం మాకేమైన సర దానా? అదేమైనా లాభసాటి యాపారమా? ఆ మర్డ రయిపోయినోడంటే మాకు బాధగా వుంటుంది. జాలి గానూ వుంటుంది. అయ్యో! మంచిగా చెబితే వినక పోయెనే అని వాడి అగ్గానానికి మేము ఎంతో యిశా రిత్తం!" బండోడు అనవసరమైన విషయాలు చెబుతు న్నట్టు అవధాన్లుగారు తెలుసుకున్నారు. కాని అతని ధోరణి ఆపే శక్తి ఆయనకు లేదు. అంతలో వస్తాదుల్లో వున్న ఓ మీసాల పోతు-

"ఏందిరా బండోడా? ఎవరు మర్డరయి పోయార్రా అని శాస్త్రులుగారు అంటూంటే నీవేంది రామాయణం సెబుతావు? నే సెబుతా నువ్వాగు" అంటూ వివరిం చటం మొదలెట్టాడు మీసాలపోతు

చందాలు తప్పకుండా యివ్వాలనీ లేకపోతే పరి ణామాలు చాలా తీవ్రంగా వుంటాయనీ బండోడు అప్రత్యక్షంగానైనా స్పష్టంగా చెప్పాడు. అవధాన్లుగారు ఇక యివ్వక తప్పదని అర్థం చేసుకున్నారు. కాని యివ్వడానికి మరి డబ్బేది?

"చూడండి బాబూ! ఆపదలో వున్న వాడిని ఆదు కోవడం మానవ ధర్మం. కాదనను. పోతే చిక్కల్లా చందా అన్నప్పుడే వస్తుంది. నేనేమీ వున్నవాణ్ణి కాదు. నాలుగు పద్యాలు రాసో, సభల్లో చదివో నాలుగు రాళ్లు సంపాదిస్తున్నాను. అవి మా తిండికే చాలడంలేదు. మీకు తెలియదేమో! ఇవి కవులకు రోజులు కావు. కవిత్వం ఎవరూ చదవడం లేదు. ఇప్పుడు ప్రజలకు కాలక్షేపం కావాలి. సాహిత్యాన్ని నమ్ముకున్న వాణ్ణి - నా దగ్గరేముంటుంది మీకివ్వడానికి - సామభూతి తప్ప - అంచేత అన్యథా భావించక నన్ను వదిలిపెట్టండి" అంటూ అవధాన్లుగారు ఎంతో దీనంగా అన్నారు.

వస్తాదులు ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు. మళ్ళీ అవధానులగారి వంక చూశారు. ఆ దీనత్వంలో నిజాయితీ వున్నట్టు వాళ్ళు గమనించారు.

"పోనీ చందా యివ్వద్దు. లెగండి" అన్నాడు మీసాల పోతు.

"హమ్మయ్యా! బ్రతుకు జీవుడా!" అనుకున్నారు అవధాన్లుగారు. 'కానీ మీరో సాయం చేయాల!" అన్నాడు బండోడు. ఆ నిరక్షర కుక్షులకు తనతో ఏం పని వుంటుంది? తేను విషయంలో సాయం చేయమంటా రేమో!

"ఏదో పద్యాలు రాసుకుని బ్రతికేవాణ్ణి. నాకేం పలుకుబడి వుంటుంది? ఏదో మీకు సాయం చేయమని చెబుదామనుకుంటే ఆ లాయర్లూ, జడ్జీలూ నాకెవరూ తెలియరు. పోనీ కేసులోని మతలబులు - వివరిద్దామన్నా నేను చదివిన చదువు అందుకు అయోగ్యమైంది. మరి నేను మీకు ఏ రకంగా ఉపయోగపడగలను?"

"మీరే అన్నారుగా పద్జాలు రాత్తాంటారని. అవే రాయండి. మాంచి పద్జాలు ఓ పావుగంట సదవండి, యింటాంటే కళ్ళమ్మట నీళ్ళ రావాల".

"ఏమిటి? ఇప్పుడు నేను పద్యాలు రాసి చదివి విని పించాలి? అదీనూ విషాద గీతాలా?" అవధాన్లుగారి పరిస్థితి అప్పుడు నిజంగా విషాదభరితమైనప్పటికీ పద్యాలు రాసే స్థితిలో మాత్రం లేరు. అవును రాయాల - సదవాల! ఈడ కాదు సభలో. రేపు ఆదివారంనాడు ఓ సభ పెడతాం. అదే సంతాప సభ అంటారే అది. ఆడ సదవాల!"

"ఎవరికి నాయనా సంతాప సభ?" అన్నారు అవధాన్లుగారు అడ్డుకుంటూ -

"ఇంకెవురికి? ఆ సచ్చినోడికే. బతుకున్నోడికో! అజ్ఞాన్ని సూపి నవ్వినట్టు నవ్వాడు బండోడు. ఇల్లు దద్దరిల్లింది. పెంకుటిల్లు రెండు పెళ్ళలు వూడి కింద పడ్డాయేమో వనిపించింది.

"అదేమిటి? అతనికీ మీకు ఏం సంబంధం? అతడు పోవటమేమిటి మీరు సంతాప సభ జరపటమేమిటి?"

"ఏటి సంబందమా? మా బాగా సెప్పారయ్యా! ఏటి సంబంధం వుందని మమ్మల్ని ఆ కేసులో యిరికించారు? మాకేమీ సంబందం లేదనే ఈ సంతాప సభ పెట్టేది. మేము ఆడి సావుకు సానా బాధపడు తున్నాం అని ప్రజలకు సెప్పేందుకే సభ పెడు తున్నాం. ఆ సభలో మీరు పద్యాలు సదువుతూ వుంటే "అణ్ణి సావమాకింది ఈళ్ళు కాదరా అని అందరూ ముక్కు మీద వేలు వేసుకోవాలా - పజలంతా మమ్మల్ని మంచోళ్ళని నమ్మెయ్యాల-అమాయకుల్ని నాదిలెయ్యాల - అంటూ కేకలెయ్యాల-ఊరేగింపులు, బైటాయింపులు, లాఠీ సార్జీలు, లాకప్‌లు అన్నీ ఒక దాని ఎంట ఒకటి జరిగి పోవాల. ఊరు అట్టుడికి పోవాల. బడాబడా నాయకులు యిదేందిరా నాయనా ఈళ్ళని యిరికించాం అనుకుంటూ కోర్టుల్లో వుండే పెద్దోళ్ళకు కన్నుగీటాల. మేము బయటపడాల" అన్నాడు మీసాల పోతు.

అవధాన్లుగారి పై ప్రాణం పైనే పోయినంత పని యింది. రసజ్ఞులు మంత్రముగ్ధులయ్యేట్టు తను పద్యాలు రాసి చదివిన మాట నిజమే కానీ ఇలాంటి వ్యవహారాల్లో తను ఎప్పుడూ కలం పట్టలేదు.

"మీరు నాపై చూపుతున్న అభిమానానికి నా కృత జ్ఞతలు. నేను చాలా గొప్ప కవిగా వూహించుకుని ఎంతో గౌరవంగా ఆ సభకు ఆహ్వానిస్తున్నందుకు ఎంతో ఋణ పడ్డాను. కానీ మీరన్న విధంగా పద్యాలు రాయడం అసలే తెలియదు" అంటూ తన నిస్సహాయతను వ్యక్త పరిచారు.

గంట స్తంభం ఉగ్రనరసింహావతారం ఎత్తాడు. కాలు స్తున్న చుట్ట విసురుగా వీథిలోకి గిరాటు వేశాడు.

'ఏందయ్యా? మేమేమయినా ఎదవలమనుకుంటు న్నావా? నీవు ఎవరివో మాకు తెలవదను కుంటున్నావా? జవాబా లెక్కల్లోళ్ళికి తెలియని యిసయాలు మాకు తెలుసు. నీవు పద్జాలు రాస్తావని, సభల్లో సదువుతావని మాకు ముందే తెలుసు. ఓ కవీ! మర్యాదగా సెబు తున్నాం. నువ్వు పద్జాలు రాయాల. సభలో సదవాల. సెజల గుండెకాయలు కాలవలయిపోవాల. దాంట్లో మా మీదున్న సెడు కొట్టుకుపోవాల. నువ్వు కాదూ కూడదూ అంటే మేమేమీ సన్నాసులం కాదు గమ్మున ఎల్లిపోవడానికి. ఈ యిసయం మళ్ళీ నువ్వు నోరు ఎత్త కూడదు. అంతే! ఆదివారం సందేల సంతాప సభ. లచ్చల మంది జనం వత్తారు. వచ్చేదేంది? మేమే తోలు




కొత్తాం. మవ్వు రడీగా వుండు' గర్జిస్తూ అని ''రండిరా పోదాం ఎవుడి కోసం రాత్తాడు'' అంటూ వస్తాదుల వంక చూసి వీధిలోకి వడిచాడు. వచ్చిన వారందరూ అతణ్ణే అనుసరించారు.

అవధాన్లు గారికి వి(ద పట్టడం లేదు. తెల్లవారితే సభ. పద్యాలు రాయాలి. అదీనూ విషాదభరితమైనవి. హతునిపట్ల సానుభూతి కలగాలి. హంతకులు తన యింటికి వచ్చిన పెద్ద మనుషులు కాదని అందులో స్పష్టం కావాలి.

ఎంత ఆలోచించినా అక్షరం కదలడం లేదు. తెరచిన పెన్ను అలానే పట్టుకు కూర్చున్నారు. టేబుల్ మీద కాగితాలు రెపరెపలాడుతున్నాయి. మనస్సులో ఆలోచనలు కలవరపెడుతున్నాయి. ఆ కలవరానికి కారణం అటు హంతకుని గుణగణాలు, యిటు ఆగంతకుల సుగుణాలు తెలియకపోవడమే. తనకు తెలియని వ్యక్తులను గురించి కవిత్వం రాయడం మాటలా? అదీనూ రెండు వాక్కుల కలం పట్టని తన వల్ల అయ్యే పనా?

సదా సర్వధా సరస్వతీ దేవి ఆయన జిహ్వాగాన వర్తిస్తుంది. ఆయనఎలాంటి సమస్యాపూరణమైనా అలవోకగా చేసేవారు. ఆశువుగా చెప్పేవారు. మరీనాడు ఎందుకు ఈ దుస్థితి? మనసుకు పట్టని భావాలకు అక్షర రూపం ఇవ్వాలంటే ద్వంద్వం తప్పదేమో!

ఇది తప్పించుకోవడానికి వీలుకాని పని. పెద్దమనుషులతో కూడిన వ్యవహారం. మాటొస్తుంది. వారి మనసు కష్టపెట్టినవాడవుతాడు. వారు నొచ్చుకుంటే తనకే మా(తం క్షేమకరం కాదు!

తను గతంలో రాసిన కొన్ని పంచరత్నాలు సొరుగు లోంచి బయటకు తీశారు. పేర్లు మార్చి సరిపెడదా మనుకున్నాడు. కానీ పొత్తు కుదరందే!

తొలికోడి కూసింది. అప్పటికి పది పద్యాలు రాయటం, కొట్టి వేయటం జరిగింది. వచ్చక కాగితాలు చించేశారు. ఇది తనవల్ల కాని పని. ఏది ఎలా జరిగినా తను ఈ పని చేయలేదు. వారిని క్షమించమని వేడుకుంటాను అని నిశ్చయించుకున్నారు.

ఈ నిర్ణయానికి వచ్చిన తర్వాత మనసు స్థిమితపడుతుందని ఆయన ఆశించారు. కాని సాధ్యపడలేదు. మరింత దిగులు ఏర్పడింది. అప్పటికే సంధ్యా వందనానికి వేళ మించిపోతూంది. గబగబా లేచి కాలకృత్యాలు తీర్చుకుని గాయ(త్రీ మం(తం జపిస్తున్నారు. మనసు లగ్నం కావటంలేదు, ధ్యాన భంగం కలుగుతూంది. ఎలాగో ఆపని అయిందనిపించారు.

అల్పాహారం తీసుకుని టేబుల్ ముందు కూర్చున్నారు. రా(త్రంతా అని(ద్రవల్ల తూలుడు వస్తోంది. ఆలోచనల స్థానే ని(ద్ర ముంచుకు వస్తోంది. మరోసారి మొహం కడుక్కుని వేడి వేడి కాఫీ తాగారు. మగత వదిలింది.

పూజ గదిలోకి వెళ్ళి దైవాన్ని (ప్రార్థించారు. ''ఓ దేవా! ఈ గండం గట్టెక్కించు. నిన్నే నమ్ముకున్నాను. తల్లీ గాయ(త్రీ! ఏమిటీ పరీక్ష. ఎందుకింత కినుక వహించావు? వాణీ! వీణా పాణీ! ఎందుకమ్మా నాపై ఇంత నిరాదరణ? నిన్నే నమ్ముకుని నీ సేవలోనే మనగడ సాగిస్తున్న ఈ భక్తుని పైనా ఈ ఆ(గహం? ఈ ఒక్క పర్యాయం మాటదక్కించు.మరి నిన్ను అడగను. నీ వాత్సల్యం లేనివాడు నేను కలం పట్టి ఏమి (ప్రయోజనం? ఇన్నాళ్ళూ రసానందం కోసం, పారలౌకికమైన సాహిత్య దివ్యానుభూతి కోసం, జగద్ధితం కోసం సాహిత్యాన్ని సేవించిన వాడిని, ఇప్పుడీ తుచ్ఛమైన లౌకిక (ప్రయోజనం కోసం కవిత్వ శక్తిని అర్థిస్తున్నానని కినుకా? తల్లీ సరస్వతీ! నా కాలం చెల్లిపోయింది. నీ సేవకు ఇక ఈ దాసుడు అనర్హుడని తేలిపోయింది. ఇక ముందు కలం పట్టను!

''ఈ ఒక్కసారికి నా మాట దక్కించు'' అంటూ ధ్యానం చేస్తూ కూర్చున్నారు అవధాన్లుగారు.

ఇంటి ముందు కారు వచ్చి నిలిచింది. అవధాన్లుగారు పూజా మందిరంలో చివరిసారిగా దేవిని మనసారా (ప్రార్థించారు. కండువా పైన వేసుకుని వచ్చి కారులో కూర్చున్నారు.

సభా(ప్రాంగణం కోలాహలంగా వుంది. అది ఓ విశాల మైదానం. ఎటు చూసినా జనం మిడతల దండులా. కేకలూ అరుపులూ భూకంపం వచ్చినట్టు. ఎక్కడెక్కడి నుంచో జనం వచ్చిపడుతున్నారు సము(ద్ర కెరటాల్లా.

అవధాన్లుగారు వేదిక నలంకరించారు. వేదికపైనున్న వ్యక్తులను పరీక్షగా చూశారు. ఏవీ తెలిసిన మొహాల్లా లేవు. పంచెలు, లాల్చీలు, సఫారీ సూట్లు, గుబురు మీసాలు, గంట్లుపడి కళావిహీనంగా వున్న మొహాలు, (క్రౌర్యంతో నిండిన కళ్ళు, ఇవే ఆయన గుర్తుపట్టగలని.

సభా (ప్రాంగణంవైపు చూశారు. మబ్బులు కమ్ముకున్నట్టు జనం. మధ్య మధ్యలో మేఘ గర్జనలా అరుపులు. ఉరుములు మెరుపులు. పడగవిప్పిన పాముల్లా నాట్యం చేస్తున్న లాఠీలు, ఎ(ర్ర టోపీలు, కాకీ చొక్కాలు.


తనకు ఇక్కడ ఏం పని? ఇదేమీ సాహిత్య సభ కాదు. సాహితీ సదస్సులకు ఇంత గుంపు రాదు. అది ఆయనకు ముందే తెలుసు. మరైతే తను ఇక్కడకు ఎందుకు వచ్చినట్టు? విషాద గీతాలు చదివేందుకు. అదీనూ పెద్ద మనుషుల కోరిక కాదనలేక! వెంటనే తన కర్తవ్యం స్ఫురించింది.

ఒక్కొక్కరు మైకు ముందుకు వచ్చి ఏవేవో ఉపన్యాసాలు ఇస్తున్నారు. సంతాపసభ అన్న విషయం మర్చిపోయి జనం చప్పట్లు కొడుతున్నారు. ఎవరో మైకులో తన పేరు సంబోధించారు. మైకు ముందుకు రావాల్సిందనీ, సంతాప సందేశం ఇవ్వాల్సిందనీ, కవితలు వినిపించాల్సిందనీ ఆజ్ఞాపిస్తున్నట్టు అన్నారు.

అవధాన్లుగారు లేచి మైకు ముందు నిలబడ్డారు. కళ్ళు మూసుకుని ఒక్క క్షణం సరస్వతీ దేవిని స్మరించారు. ఈ ఒక్కసారికి మాట నిలబెట్టాల్సిందని మనసారా మరోసారి వేడుకున్నారు.కళ్ళు తెరచి చూశారు. ఆయన కంటి ముందు ఎవ్వరూ కనబడటం లేదు. ఆశువుగా పద్యాలు చదవటం మొదలుపెట్టారు.

సభంతా నిశ్శబ్దమయిపోయింది. సూది పడ్డా వినిపించేట్టు నీరవంగా వుంది. విషాదమనే వెల్లువలో జనం తలమునకలైపోతున్నారు. తన్మయులై పోతున్నారు. నిశ్చేష్టులు, నిశ్చేతనులు అయిపోతున్నారు.

అవధాన్లుగారు కళ్ళు మూసుకుని తదేకంగా విషాద గీతాలు ఆలపిస్తున్నారు. ఆయనకు ఈ లోకంతో పని




లేదు. ఆయన హృదయాంతరాళాలలో విషాదపు పొరలు ఒక్కొటొక్కటిగా విడివడుతున్నాయి. శబ్దరూపం దాలుస్తున్నాయి. ఆయన ఆశువుగా, అలవోకగా వినిపిస్తున్నారు. ఆయన ఎక్కడ వుందీ తన చుట్టూ ఏమి జరుగుతూంది ఎప్పుడో విస్మరించారు. కళ్ళు మూసుకుని ఉన్నత సాహిత్య శిఖరం నుంచి అగాధమైన విషాదపు లోతుల్లోకి వెళ్ళిపోతున్నారు.

పెద్ద శబ్దం పిడుగుపడ్డట్టు. భూమి (బద్దలయినట్టు అగ్ని పర్వతాలు (ప్రేలినట్టు- క్షణంలో సభా వేదిక భగ్గున మండిపోయింది. అగ్ని జ్వాలలు ఉవ్వెత్తున లేచాయి. తమ కళ్ల ముందు ఏర్పడ్డ ఈ భీకర దృశ్యానికి (ప్రజలు బెంబేలెత్తి చెల్లాచెదరైపోయారు. వరద తాకిడికి గడ్డిపోచల్లా చిందరవందరగా హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు - మరుక్షణంలో వేదిక భస్మీపటలమైపోయింది. అంత దారుణం-అలా జరుగుతుందని ఎవరూ ఊహించ లేదు. ఎలా జరిగిందో ఎవరికీ తెలియదు.

అవధానులుగారు సభకు వస్తూ సరస్వతీదేవి ముందు నిలబడి - తల్లీ! ఇదే నా చివరి సభ అన్న మాట అక్షరాల నిజమయింది!

●